రచయిత అనేవాడు ఎంత గొప్పవాడైనా, నలుగురూ తన కథల్ని చదివి ప్రశంసించాలన్న కోరిక ఏ మూలనో కొంత ఉండి తీరుతుంది. ఆఫీసరు ప్రజాపతీ కూడా అంతే!

'ప్రజా పతంతు ఇదం నమః' అన్న జగన్నాథుడి పాచిక పారిందా?

# పాచిక

## బి. రఘు రామరాజు

సంక్రాంతి ముందు నాలుగు రోజుల సెలవు కావాలంటూ అర్జీ అయితే పెట్టుకున్నాడు కాని, అది శాంక్షన్ అవుతుందన్న నమ్మకం జగన్నాథానికి, ఏ కోశానా లేదు. ఈ మధ్యే బదిలీ అయి వచ్చిన సెక్షనాఫీసరు ప్రజాపతి - 'చండ శాసనుడు' 'కర్కోటకుడు' అని ఎన్నో బిరుదులు సంపాదించిన ఉద్దండ పిండం. అలాంటి వాడితో నాలుగు రోజుల సెలవు ఎలా శాంక్షన్ చేయించుకోవాలో తెలీక సతమత మవుతున్న జగన్నాథానికి. ఆ ఉత్తరం కనిపించగానే కళ్ళు తళుక్కున మెరిశాయి. ప్యూను చేతిలోంచి గబగబా ఆ ఉత్తరాన్ని లాక్కుని మరోసారి చదువుకున్నాడు.

"శ్రీ ప్రజాపతి గార్కి,

"నమస్కారం.

"మీరు పంపిన కథ 'సంక్రాంతి సంబరం' మాకు అందినది. మీ రచనను మా సంక్రాంతి ప్రత్యేక సంచికలో ప్రచురించుతున్నామని తెలియ చేయడానికి సంతోషి స్తున్నాం.

"సంపాదకుడు
"ఆంధ్రవీణ".

"గుడ్ మార్నింగ్ సార్!" ఆఫీసరు గదిలోకి ప్రవేశించి వినయంగా అన్నాడు జగన్నాథం.

తాను తిరిగి విష్ చేసిం తర్వాత కూడా. జగన్నాథం కదలకుండా ఉండడంతో, "ఏం కావాలోయ్?" అన్నాడు ప్రజాపతి.

"మీరు కథలు కూడా రాస్తారని మాకిప్పుడే తెలిసింది సార్!" చేతులు కట్టుకుని విధేయత ఉట్టిపడేలా అన్నాడు జగన్నాథం.

"ఓహ్! అదా సంగతి! ఎలా తెలిసిందోయ్ నేను కథలు రాసే సంగతి?" ఆసక్తిగా అడిగాడు ఆఫీసరు ప్రజాపతి.

"ఇందాకా 'ఆంధ్రవీణ' నుంచి మీకొచ్చిన ఉత్తరం చూశాను సార్. 'ఆంధ్రవీణ' లాంటి మంచిస్థాయి గల వార పత్రికలో కథ పడడమంటే నిజంగా గొప్పే సార్. నా హృదయ పూర్వక అభినందనలు సార్" సింహం ముందు ఒక సిన్సియర్ నక్క చూపే వినయాన్ని ప్రదర్శిస్తూ అన్నాడు జగన్నాథం.

"థాంక్యూ ఫర్ ది కాంప్లిమెంట్స్! అన్నట్టు, నువ్వు తెలుగు వార పత్రికలు బాగా చదువు తుంటావా?" నవ్వుతూ అడిగాడు ప్రజాపతి.

"అవును సార్. మార్కెట్లో వచ్చే అన్నీ తెలుగు వార పత్రికలు తెప్పిస్తాను సార్. నాకు కథలు చదవడమంటే చాలా ఇష్టం సార్?" అందమైన అబద్ధాన్ని చాలా అందంగా చెప్పాడు జగన్నాథం.

"అలాగా. అయితే నా కథ వీక్లీలో రాగానే తప్పకుండా చదివి నీ అభిప్రాయం చెపుతావు గదా?" నవ్వుతూ అడిగాడు ప్రజాపతి.

"అంత ప్రత్యేకంగా చెప్పాలా సార్ మీరు? మన ఊళ్ళో మీ కథ చదివే మొదటి పాఠకుణ్ణి నేనే



ఫోటో_కె.భాస్కర్

అవుతాను సార్!" ఛాతీ విరుచుకుని గర్వంగా చెప్పాడు జగన్నాథం. కాసేపయ్యాక.

"అది సరేగాని, వెళ్ళి ఈ ఉత్తరం అర్జెంటుగా టైపుచేసి పట్టుకురా!" తన సహజ ధోరణిలో అడిగాడు ప్రజాపతి.

"సార్?" అని తటపటాయిస్తున్న జగన్నాథం వంక తలెత్తి చూశా, ప్రజాపతి. "సార్! మొన్న అప్లై చేసిన — నా సెలవు —" నసిగాడు జగన్నాథం.

"ఓహ్! ఆ సంగతే మరిచాను. నీ సెలవు సాంక్షనయిందోయ్!" అని అప్లికేషన్ మీద 'శాంక్షన్డ్' అని రాసి 'ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్‌లో దాన్ని ఇవ్వ'మంటూ అందించాడా ప్రజాపతి.

సంతోషంలో ఎగిరి గంతేసినంత పని చేశాడు జగన్నాథం.

★ ★ ★ ★

"సంక్రాంతికి అత్తగారింటికి వెళ్ళ గలనా?" అని దిగులు పడిన జగన్నాథం సమస్య సులభంగానే పరిష్కార మయ్యింది.

యముడి లాంటి ప్రజాపతి బలహీనతలు కనిపెట్టడానికి జగన్నాథం లాంటి అనుభజ్ఞుడికి కూడా చాలా కాలం పట్టిందంటే ఆశ్చర్యమే మరి!

రచయిత అనే వాడు ఎంత గొప్పవాడయినా, నలుగురూ తన కథల్ని చదివి ప్రశంసించాలనే కోరిక ఏ మూలనో కొంత ఉండి తీరుతుంది. ఆఫీసరు ప్రజాపతి కూడా అంతే! ఇన్నాళ్ళకి తన కథల్ని గురించి చర్చించడానికి తన ఆఫీసులో కూడా ఒక వ్యక్తి ఉన్నాడని తెలిసి చాలా సంతోషమయ్యింది అతనికి.

"సార్! పేరు పెట్టాక మీరు కథ రాస్తారా? కథ రాశాక పేరు పెడతారా?" జగన్నాథం ఒకరోజు అడిగేశాడు.

"రెండు రకాలుగానూ" ప్రజాపతి నవ్వుతూ బదులిచ్చాడు.

"మీరు మొదట చిత్తు రాసి తర్వాత సాపు రాస్తారా? లేక ఏకంగా 'సాపు' రాసేస్తారా?" రెండో రోజు అడిగాడు జగన్నాథం ఎంతో ఆసక్తి ఉన్నవాడిలా.

ఓపిగ్గా జవాబిచ్చాడు ప్రజాపతి.


"మీరు కథలు రాత్రిపూట రాస్తారా? లేక తెల్లవారు జామునా?" ఇలా రకరకాలుగా ప్రశ్నలు వేస్తుండడం జగన్నాథానికి, వీటన్నింటికీ ఓపిగ్గా జవాబివ్వడం ప్రజాపతికీ క్రమంగా అలవాటయింది.

★ ★ ★ ★

సెలవులకు జగన్నాథం అత్తగారి ఊరెళ్ళాడు. అక్కడ 'న్యూస్ స్టాండ్'లో 'ఆంధ్రవీణ' సంక్రాంతి ప్రత్యేక సంచిక చూశాడు. ఒక చేయి జేబులో పెట్టి, మరో చేత్తో పత్రికను తిప్పుతూ దాని ధర చూసి అదిరి పడ్డాడతను.

"పది రూపాయలు!

"పది రూపాయలు అంటే రెండు కిలో టొమాటోలు, లేదా పావు కిలో టీ పొడి, లేదా లీటరున్నర పాలు. అటువంటి పది రూపాయలు పెట్టి కొని పత్రిక చదివితే నాకు ఒరిగే దేముంది? ఆఫీసరు రాక్షసుడి కథ పడితేనేం, పడకుంటే




నేం? కీర్తి డబ్బు వస్తే అతగాడికొస్తాయి కాని మధ్యన తాను పది రూపాయలు పోగొట్టుకోవడం దేనికి?'' అనుకుని జేబులోంచి పట్టిచేయి బయటకు తీసి అక్కడి నుంచి మెల్లగా జారుకున్నాడు జగన్నాథం.

నంక్రాంతి అయ్యాక, ఆఫీసుకి వచ్చాడు జగన్నాథం.

''ఆంధ్రవీణ నంక్రాంతి 'ఇష్యూ' చూశావటోయ్?'' అడిగాడు ప్రజాపతి, గుడ్ మార్నింగ్ చెప్పడానికి తన గదిలోకి వచ్చిన జగన్నాథంను.

''అబ్బ! ఏం కథలు సెలక్ట్ చేశారు సార్ ఈసారి! అన్నీ ఆణిముత్యాలే! అందులో మీ కథ సింప్లీ సుపర్బ్. ఆ హీరోను మలచిన తీరు, నంభాషణలు నడిపించిన పద్ధతి — అబ్బ? మాటల్లో చెప్పలేదు సార్. కథ అంటే అలా ఉండాలి సార్! నా కయితే గోపీ చంద్, బుచ్చిబాబు, కొడవటి గంటి వీళ్ళంత కళ్ళముందు కదిలారను కోండి కథ చదువుతుంటే. కథలో – మానవత్వం అంటే ఏమిటో భలేగా చెప్పారు సార్. మా ఇంట్లో కూడా — భలే పొగిడారనుకోండి మీ కథను!'' గంగా ప్రవాహంలా సాగుతోంది నంభాషణ.

''అవుతావా లేదా, నీ అధిక ప్రసంగం?'' ప్రజాపతి గర్జించాడు, పేపర్ వెయిట్‌తో టేబిల్ మీద గట్టిగా బాదుతూ.

'ఏం సార్! అలా అంటున్నారు. అవున్లెండి. మీలాంటి గొప్ప రచయితలకు పొగడ్తలంటే నుతరామూ ఇష్టముండదు లెండి. తెలియక వాగాను ఏదేదో?'' అన్నాడు జగన్నాథం.

''నీకేమైనా మతి చలించిందా మిస్టర్ జగన్నాథం? ఆర్ యు ఆల్‌రైట్?'' రెట్టించాడు ప్రజాపతి.

''ఏం సార్, అలా అంటున్నారు? నేనేమైనా తప్పుగా మాట్లాడుతున్నానా?'' రిక్వెస్టింగ్‌గా అడిగాడు జగన్నాథం.

''ఇదిగో? ఈ ఉత్తరం చూడు. తర్వాత మాట్లాడు ఏదైనా ఉంటే?'' అంటూ ఓ కార్డు జగన్నాథం వేపు విసిరాడు ప్రజాపతి.

''శ్రీ ప్రజాపతి గార్కి,

''నమస్కారం. 10-1-91.

''స్థలా భావం వల్ల మీ కథను నంక్రాంతి ప్రత్యేక నంచికలో ప్రచురింప లేక పోతున్నామని గమనించ గోర్తాం. దానిని వీలు వెంబడి ప్రచురింప గలము. నదా మీ నహకారాన్ని ఆశిస్తూ.

''నంపాదకుడు, ఆంధ్రవీణ''.

ఉత్తరం చదివిన జగన్నాథం ముఖం, చూసి తీరాల్సిందే తప్ప మాటల్లో వర్ణించడం కష్టం.

★